24న జర్నలిస్టుల చలో కలెక్టరేట్

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్

కుత్బుల్లాపూర్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న కలెక్టరేట్ల వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ కోరారు. జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, పెన్షన్ స్కీమ్, జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం తదితర డిమాండ్లను నెరవేర్చడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను పక్కన బెట్టిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా సీఎం రేవంత్‌రెడ్డి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ నెల 24న నిర్వహించే కలెక్టరేట్ల ధర్నాల్లో జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

వైభవంగా ఆంజనేయస్వామి ఆలయ వేడుకలు



పూజలో పాల్గొన్న భక్తులు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట పరిధి ఇందిరమ్మ కాలనీలోని ఆంజనేయ స్వామి ఆలయ 3వ వార్షిక వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, నేతలు బెంబడి బుచ్చిరెడ్డి, సీతారాంరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అసమానతలపై నిరంతర పోరాటం : సీపీఎం



కుత్బుల్లాపూర్: దోపిడీ, అసమానతలను రూపు మాపేందుకు సీపీఎం నిరంతరం పోరాడుతుందని సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ఫిబ్రవరి 21 రెడ్ బుక్ డేను పురస్కరించుకుని షాపూర్‌నగర్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ 24వ జాతీయ మహాసభ రాజకీయ తీర్మానం ముసాయిదా వివరాలు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ చదువుతూ సమాజాన్ని మార్చాలని కోరారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గర్జించేది కమ్యూనిస్టులేనని అన్నారు. కార్యక్రమంలో దేవదానం, మల్లారెడ్డి ఆంజనేయులు, యాదవరెడ్డి, తిమ్మప్ప, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రంగారెడ్డినగర్: వేసవిలో దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం డివిజన్ అధ్యక్షుడు ఉస్మాన్ అన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి సౌజన్యంతో గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మోయిస్, శివకుమార్, మాధవిరాణి, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలను అన్ని విధాలా ఆదుకుంటాం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని ఆర్ఎంపీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాలుగా ఆదుకుంటామని టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి అన్నారు. ఈనెల 18న 33 జిల్లాల ఆర్ఎంపీలు ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మద్దతు తెలిపి మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో శుక్రవారం హస్మత్‌పేట చౌరస్తాలో ఆర్ఎంపీలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రొఫెసర్ కోదండరాం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్‌రెడ్డి, నాయకులు శ్రీరాములు, వెంకటేశ్, మహేష్, ఆర్ఎంపీలు రాజా గట్టు, రాజేంద్ర, భీమ్‌రావు, నాగేందర్, లతీఫ్, రాజశేఖర్, రాజు, అరవిందస్వామి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కూకట్‌పల్లి: వివేక్‌నగర్‌కు చెందిన యాదగిరికి రూ.1.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును బాధితుడి కుమార్తె రీతుకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ శుక్రవారం అందజేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీచర్లే ఆయాలుగా..

అంగన్‌వాడీల్లో వేధిస్తున్న సిబ్బంది కొరత

- 24 కేంద్రాలకు 9 కేంద్రాల్లో ఆయాలు, 4 కేంద్రాల్లో టీచర్ల ఖాళీలు
- ఒక్కరి పైనే పని భారం



టీచర్ లేని ఓ అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులు

సుభాష్‌నగర్: అంగన్‌వాడీ సెంటర్‌లో విధులు నిర్వహించే టీచర్ కేంద్రం బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుంది. దీనికి తోడు అదనంగా ప్రభుత్వానికి సంబంధించిన ఇతర పనులను కూడా చేయాల్సి ఉంటుంది. ఆయాల పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇద్దరు చేసే పని ఒక్కరే చేస్తుండటంతో పని భారం పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుండిగల్ మండలంలో 24 కేంద్రాలకు గాను దూలపల్లి, కొంపల్లి, బహదురుపల్లి, గండి మైసమ్మ, చంద్రశేఖర్ నగర్‌లలోని 9 కేంద్రాల్లో ఆయాలు లేరు. దీంతో ఆయాల పని స్థానికంగా ఉన్న టీచర్‌లే ఓ వైపు పాఠాలు చెబుతూ, మరోవైపు ఆయాలుగా విద్యార్థుల ఆలన పాలన చూసుకుంటున్నారు. కొంపల్లి, దుండిగల్, చంద్రశేఖర్‌నగర్, చర్చి గాగిలాపూర్ 4 సెంటర్లలో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

> అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉండటంతో సరైన సేవలు అందడం లేదు. ఆయాలు లేని చోట టీచర్లే వారి విధులు నిర్వర్తించి ఆయాల విధులు కూడా నిర్వహిస్తున్నారు. టీచర్లు లేని చోట ఆయాలే కేంద్రం బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. 24 కేంద్రాలకు 9 కేంద్రాల్లో ఆయాలు, 4 కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పనిభారంతో..

చిన్నారులకు పాఠాలు చెప్పడమే కాకుండా ఆన్‌లైన్ వర్క్, చిన్నారుల డాటా, తల్లిదండ్రుల వివరాలు, గర్భిణులకు బాలమృతం వంటి అంగన్‌వాడీ పనులను టీచర్‌లు నిర్వహించాల్సి ఉంటుంది. దీనికి తోడు సర్వేలు, పల్స్ పోలియో, ఎన్నికల విధులు వంటివి చూసుకోవాల్సి వస్తుంది. చాలా చోట్ల ఆయాలు లేకపోవడంతో పని భారం పెరిగి ఒత్తిడికి లోనవుతున్నారు.పై అధికారులకు చెప్పలేక లోలోన కుమిలిపోతున్నారు.

టీచర్లను చూడని చిన్నారులు

కొంపల్లి, దుండిగల్, చంద్రశేఖర్ నగర్, చర్చి గాగిలాపూర్ సెంటర్లలో టీచర్‌లు లేకపోవడంతో ఆయాలే అన్ని చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. టీచర్లు లేకుంటే తమ పిల్లలకు అక్షరాలు ఎవరు నేర్పిస్తారని పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

> కొన్ని సెంటర్లలో ఆయాలు, టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఖాళీ ఉన్న సెంటర్లకు పక్కనే ఉన్న టీచర్లను ఇన్‌చార్జిగా నియమించాము. త్వరలో ఈ పోస్టులు రిక్రూట్‌మెంట్ జరుగనున్నాయి. ముందుగానే ఖాళీ ఉన్న పోస్టులపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తొందరలోనే అన్ని పోస్టులను భర్తీ చేయడానికి అవకాశం ఉన్నది.
> – శారద, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి, దుండిగల్.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి

బీఆర్ఎస్ శాసనసభ విప్ వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని బీఆర్ఎస్ శాసనసభ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే నివాసంలో వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఎమ్మెల్యే అధికారులకు చెప్పినా పనులు చేయడం లేదని పలువురు ఆయన దష్టికి తీసుకొచ్చారు. మీ సహకారంతో తప్పకుండా అభివృద్ధి పనులు చేస్తానని, ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన విడిచిపెట్టే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

జాతర బ్రోచర్ ఆవిష్కరణ

గాజులరామారం డివిజన్ మహదేవపురంలోని బాలయ్యనగర్‌లోని రేణుకా ఎల్లమ్మ జాతరను నిర్వహించనున్నారు. దీంతో పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే జాతర బ్రోచర్ ఆవిష్కరించారు. 22న ఉదయం 8 గంటలకు శిఖర పూజ, 9 గంటలకు బొడ్రాయి పూజ, నవగ్రహారాధన, 11 గంటలకు చండీ హోమం, 23న అమ్మవారికి 21 కలశాలతో పూజ, ఉదయం 4 గంటలకు అభిషేకం, 8 గంటలకు కుంకుమార్చనలు, 11 గంటలకు రేణుకా ఎల్లమ్మ కల్యాణం, సాయంత్రం 5 గంటలకు ఫలహారం బండి ఊరేగింపు, 24న మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి సమర్పించిన ఒడిబియ్యంతో అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.



రేణుకా ఎల్లమ్మ జాతర బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వానం

జీడిమెట్ల గ్రామానికి చెందిన మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ఈ నెల 26న జరిగే 54వ శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. 26న తెల్లవారుజాము 4 గంటలకు గంగస్నానం, రాత్రి 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 27న మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామి వారి కల్యాణం, మధ్యాహ్నం 2 గంటలకు అగ్ని గుండాలు, బోనాలు, గొర్రెపోతుల బండి ఊరేగింపు, గొలుసులు తెంపుట, అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.

వీఎన్ఆర్ కళాశాలలో కన్వర్జెన్స్ 2కె25 ప్రారంభం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ సీవీఎస్ కిరణ్

నిజాంపేట్: భారతదేశంలో ఇంజినీరింగ్ రంగంలో పురోగతి ఉన్నా కొన్ని విడి భాగాల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తుందని స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ మెటీరియల్స్ అండ్ స్ట్రాటజిక్ ఇనిషియేటివ్స్ విభాగ ఉపాధ్యక్షులు డాక్టర్ సీవీఎస్ కిరణ్ అన్నారు. ప్రగతినగర్‌లోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న కన్వర్జెన్స్ 2కె25 వార్షిక సాంకేతికోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విధానాలతో మాత్రమే చైనా వంటి దేశాలతో పోటీ పడే స్థాయికి అందుకోగలమన్నారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన జ్యోతి ప్రధాన కార్యదర్శి కోడె దుర్గా ప్రసాద్, సంస్థ పూర్వాధ్యక్షులు డీఎన్ రావు, డీన్ డాక్టర్ వై.పద్మాశాయి, ప్రధానాధ్యక్షులు సీడీ నాయుడు, సభ్యులు హరిశ్చంద్ర పాల్గొన్నారు.

పీఎస్‌లో ఫీడింగ్‌రూం ప్రారంభించిన సీపీ

జీడిమెట్ల: జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ ప్లే ఏరియా, ఫీడింగ్ రూంను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి శుక్రవారం ప్రారంభించారు. జీడిమెట్ల పీఎస్‌లో వాక్సెన్ ఇంటర్నేషనల్ స్కూల్ సహకారంతో ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ ఏర్పాటు చేశారు. దీనికి తోడు చిల్డ్రన్ ఫీడింగ్ చాంబర్‌ను సైతం ఏర్పాటు చేశారు. ప్రారంభించిన అనంతరం సీపీ మాట్లాడుతూ.. పీఎస్‌కు వచ్చే స్త్రీలకు, వారి పిల్లలకు సౌకర్యంగా ఉండేందుకు రెండు దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్, ఏసీపీ హన్మంతరావు, డీఐ కనకయ్య, ఎస్ఐలు ప్రేమ్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఫీడింగ్‌రూంను ప్రారంభిస్తున్న సీపీ

నాణ్యతలో అగ్రగామి భారతి సిమెంట్

కుత్బుల్లాపూర్: నాణ్యతలో భారతి సిమెంట్ అగ్రగామిగా కొనసాగుతుందని, భారతి సిమెంట్ అల్ట్రా ఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదలైందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్ అన్నారు. శుక్రవారం జగద్గిరిగుట్టలోని లక్ష్మీ వేంకటేశ్వర ట్రేడర్స్ డీలర్ షాప్ లో తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాల వేగవంతంగా పూర్తవుతుందని వివరించారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని, స్లాబ్ కాంక్రిట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలిపారు. ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ రూ.20 అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీలర్ ధర్మారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్, తాపీ మేస్త్రిలు పాల్గొన్నారు.



తాపీ మేస్త్రీలతో భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్

విద్యుత్ ఉండని ప్రాంతాలు



కుత్బుల్లాపూర్: సమ్మర్ యాక్షన్ ప్లాన్, క్యాపిటల్ వర్క్స్ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడనున్నాయని పేట్‌బషీరాబాద్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ వైష్ణవి ఎన్‌క్లేవ్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైష్ణవి ఎన్‌క్లేవ్, వనమ్స్ స్కేర్, కల్యాణ్ కన్‌స్ట్రక్షన్స్, హర్షా ఆసుపత్రి, డి.మార్ట్ వెనుక గల్లీ, 11కేవీ ప్రాగా టూల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు ప్రాగా టూల్స్ కాలనీ, బీహెచ్ఈఎల్ విస్టా, కోణార్క్ ఆసుపత్రి, ఎస్‌సీఎల్ హోమ్స్, శాటిలైట్ టౌన్‌షిప్, 11కేవీ రామరాజునగర్ ఫీడర్ పరిధిలో రామరాజునగర్, మై ఫ్రెండ్స్ సర్కిల్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

మహిళ అదృశ్యం



సభావత్ జిజలి

దుండిగల్: సొంత గ్రామానికి బయలుదేరిన మహిళ అదృశ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా లక్ష్మీ తండాకు చెందిన సభావత్ జిజలి(45) ఈ నెల 16వ తేదీన దుండిగల్‌లోని డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో నివసిస్తున్న తన కుమార్తె నేనావత్ నీలా వద్దకు వచ్చింది. అనంతరం తిరిగి తన సొంత గ్రామానికి వెళ్లేందుకు ఈ నెల 19న గండి మైసమ్మ చౌరస్తాకు బస్సులో వెళ్లింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ లభించలేదు. మరుసటి రోజు వరకు కూడా సొంత గ్రామానికి చేరుకోకపోవడంతో కుమార్తె నీలా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంద శాతం పన్ను వసూళ్లే లక్ష్యం



సిబ్బందికి సూచనలు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్

దుండిగల్: వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేసే విధంగా సిబ్బంది పని చేయాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది పని తీరును శుక్రవారం పరిశీలించారు. ముఖ్యంగా మొండి బకాయిలు ఉన్న వారిని విచారించి పన్నులు చెల్లించే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. పన్నులు చెల్లించని వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అదే విధంగా అన్ అసెస్మెంట్, అండర్ అసెస్మెంట్ లేకుండా చూడాలని, షాపులు, హోటళ్లు, రెస్టారెంట్లు, వ్యాపారాలు చేసే వారు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, జవాన్లు పాల్గొన్నారు.

ఒక్క సీసీ కెమెరా వెయ్యి కళ్లతో సమానం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఏసీపీ హనుమంతరావు

సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

బాలానగర్: ఒక్క సీసీ కెమెరా వెయ్యి కళ్లతో సమానమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. శుక్రవారం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజల భాగస్వామ్యం అభినందనీయమన్నారు. అనంతరం బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ మాట్లాడుతూ.. సమాజ భద్రతలో భాగంగా ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సీఐ టి. నరసింహరాజు, డీఐ నాగిరెడ్డి, ఎస్ఐలు రాంనారాయణ, సరళ, హజీమియా, ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శంకరయ్య, దుర్గ, ఆంజనేయులు, రవికుమార్, నాగ భూషణం, నాంచారమ్మ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ల పరిశీలన



నీటి సరఫరా వివరాలు తెలుసుకుంటున్న డీజీఎం రాజేష్

చింతల్: గోదావరి ప్రధాన పైపులైన్ అయినా 3000 ఎంఎం దయా పైపులైన్‌కు ఈ నెల 17న మరమ్మతులు చేపట్టారు. ఈ క్రమంలో నగరంలోని పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. మరుసటి రోజు సాయంత్రం నుంచి నీటి సరఫరా పునరుద్ధరించడంతో రెండు రోజులుగా గోదావరి జలాలు కుత్బుల్లాపూర్‌లోని పలు ప్రాంతాల్లో సరఫరా అవుతున్నాయి. శుక్రవారం కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం అశోక్ జీడిమెట్ల, షాపూర్‌నగర్ రిజర్వాయర్లను డీజీఎంలు రాజేష్, రవి, వికాస్‌లతో కలిసి పరిశీలించారు. కేటాయించిన నీటిలో ఆయా బస్తీలు, కాలనీలకు కేటాయించిన సమయాలకు అనుగుణంగా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.

చెత్తను తరలించండి!



ప్రధాన రోడ్ల వెంబడి డంప్ చేస్తున్న చెత్తను తరలించడంలో పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ ప్రధాన రహదారిలో కొద్ది రోజులుగా చెత్తను తరలించకపోవడంతో గుట్టలుగా పేరుకుపోయింది. ప్లాస్టిక్ కవర్లతో ఆహార పదార్థాలను కూడా వేస్తుండటంతో తీవ్ర దుర్గంధ వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెత్తను తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. – రంగారెడ్డినగర్

ఆర్నెల్లుగా జీతాల్లేవు

> ప్రజలంతా నిద్రలో ఉంటే.. వారు మాత్రం వీధుల్లో విధుల్లో ఉంటారు.. ఊరు తెల్లారేసరికి రోడ్లను అందంగా ముస్తాబు చేస్తారు.. ఇళ్లల్లో వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జనావాసాలకు దూరంగా తరలించి రోగాల నుంచి విముక్తి చేస్తారు.. అందరి సంక్షేమం కాంక్షించే వారు మాత్రం సమయానికి జీతాలు చేతికి రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దొరికిన చోట్ల అప్పులు చేసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నెలల తరబడి జీతాలు రాకపోవడంతో సారూ.. జీతాలు లేకుంటే ఎట్లా బతికేదీ.. అంటూ వేడుకుంటున్నారు.
> – సాక్షి, సిటీబ్యూరో



అర్ధాకలితో కొనాయిపల్లి పంచాయతీ కార్మికులు

మిగతా 33 జీపీల్లో 3 నెలలుగా అందని వేతనాలు

పూట గడవడం కష్టమవుతోందని కార్మికుల ఆవేదన

నగర శివారులో 600 మందికి వేతనాలు లేవు

కొనాయిపల్లి పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు రాకపోగా, ఉద్దమర్రి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు 4 నెలల నుంచి, మిగతా 32 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు 3 నెలల నుంచి జీతాలు అందడం లేదు. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 34 గ్రామ పంచాయతీలు ఉండగా, వీరికి గరిష్టంగా ఆరు నెలల నుంచి మూడు నెలలుగా వేతనాలు అందక వారి కుటుంబాలు అర్ధాకలితో జీవితాన్ని నెట్టుకొస్తున్నాయి. దీంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వీధులను శుభ్రపరిచే కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం శోచనీయం. వేతనాలు ఇవ్వాలని వేడుకుంటున్న వారికి.. మన ప్రజాప్రతినిధుల స్పందన ఏవిధంగా ఉంటుందోననే చర్చ సాగుతోంది.

- నూతన పంచాయతీ చట్టం ప్రకారం వీరిని మల్టీ పర్పస్ వర్కర్స్‌గా పిలుస్తున్నారు. ఈ కార్మికులకు సంబంధించిన వేతనాలు ప్రతినెలా వారి ఖాతాల్లో జమ అవుతుంటాయి. గ్రామ పంచాయతీ ఆర్థిక వనరులను బట్టి 8 నెలల నుంచి 3 నెలలుగా వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమకాకపోవడం గమనార్హం. జీతాలు అందక వారు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు.
- నగర శివారు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో గ్రామ పంచాయతీల్లో 600 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి నెలకు రూ.9.500 చొప్పున రూ.57 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. వీరంతా పారిశుద్ధ్యం, ట్రాక్టర్ డ్రైవర్లు, పన్నుల వసూల్లు, నీటి సరఫరా తదితర విభాగాల్లో పనులు చేస్తున్నారు.

త్వరలో వేతనాలు..

పంచాయతీ కార్మికుల వేతనాల అందకపోవడంతో ఇబ్బందిగా ఉందని సంబంధిత శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టడంతో పాటు ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. త్వరలో వేతనాలు అందుతాయని పంచాయతీ శాఖ అధికారులు భావిస్తున్నారు.

అప్పు చేసి కడుపు నింపుకుంటున్నారు

> గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతినెలా అందించే రూ.9,500 జీతం ఇవ్వకపోవడంతో అప్పులతో కాలం గడుపుతున్నాం. స్కూల్ ఫీజు మొదలుకొని నిత్యావసరాలు, కరెంటు బిల్లులు తదితర వాటికి ప్రైవేట్ ఫైనాన్స్‌లో మిత్తికి డబ్బులు తీసుకుని చెల్లించాల్సి వస్తోంది. కార్మిక కుటుంబాల్లో కొందరు పస్తులు ఉండాల్సి వస్తోంది. వేతనాలు సకాలంలో అందించకపోతే పంచాయతీల్లో పనులు నిలిపివేసి ఆందోళనకు దిగుతాం.
> – శ్రీనివాస్, జిల్లా గ్రామ పంచాయతీ కార్మిక సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు